క్లుప్తంగా

సీఎం జగన్ దృష్టికి స్థానిక సమస్యలు


సీఎం వైఎస్ జగన్‌తో ఎమ్మెల్యే జోగులు, సందీప్

రాజాం: రాజాం ప్రధాన రహదారి విస్తరణలో జరుగుతున్న జాప్యాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. తాడేపల్లిగూడెంలోని సీఎం క్యాంప్ ఆఫీస్‌లో బుధవారం సీఎం జగన్‌ను కలిసి నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. రహదారి విస్తరణ పనులు పూర్తిచేయాలని, రూ.5.97 కోట్లు తొలివిడత బిల్లులు విడుదల చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే చెప్పారు. దీనిపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు నిధులు విడుదల చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ కంబాల సందీప్ ఉన్నారు.

అపరాల సాగుపై రైతుల ఆసక్తి


నందబలగ సమీపంలో పెసర సాగు

రాజాం: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు రబీలో అపరాల పంటలు సాగుచేస్తున్నారు. అమరాం, దోసరి, నందబలగ, గార్రాజుచీపురుపల్లి, మారేడుబాక తదితర గ్రామాల్లో మినప, పెసర, ఉలవ పంటలు సాగులో ఉన్నాయి. పెసర, మినుమలకు మార్కెట్‌లో క్వింటా ధర రూ.8 వేలు వరకు పలుకుతోంది. ఎకరా సాగులో 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వస్తే ఈ పంట రైతుకు పెట్టుబడిలేని ఆదాయంగా కలిసివస్తుందని వ్యవసాయశాఖ అధికారి ఎ.రేనుకాసాయి అన్నారు.

దీపాలతో ఊరేగింపు


దీపజ్యోతులతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు

వంగర: మండలంలోని పటువర్ధనం గ్రామంలో మార్గశిర పౌర్ణమి సందర్భంగా మంగళవారం రాత్రి భవానీ దీక్ష భక్తులు అమ్మవారికి దీపాలు సమర్పించారు. గ్రామానికి చెందిన భవానీ భక్తులు యజ్జల రామారావు, ఉరిటి చిన్న ఆధ్వర్యంలో భక్తులు దీపాలతో ఊరేగింపు చేశారు. అనంతరం దుర్గదేవి ఆలయం వద్ద జ్యోతులు సమర్పించి అమ్మవారికి పూజలు చేశారు.

వైఎస్సార్ బీమా అందజేత


లక్ష్మికి బీమా నగదు అందజేస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, తదితరులు

రేగిడి: మండలంలోని బుడితిపేట గ్రామానికి పరిచర్ల లక్ష్మికి వైఎస్సార్‌బీమా కింద తక్షణ సాయంగా రూ.10 వేలును వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు బుధవారం అందజేశారు. ఇటీవల లక్ష్మి భర్త గణేష్ మృతి చెందడంతో నామినీగా ఉన్న లక్ష్మికి ప్రభుత్వం వైఎస్సార్ బీమా కింద లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. మిగిలిన రూ.90 వేలు మొత్తం నామినీ బ్యాంకు ఖాతాలో నేరుగా జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు, పంచాయతీ కార్యదర్శి దమయంతి, వెల్ఫేర్ అసిస్టెంట్ సుధీర్‌కుమార్, వలంటీర్ దుర్గారావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి


చెత్తను డంప్‌యార్డుకు తరలిస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ మేనేజర్ ఎంవీ నాగరాజు తెలిపారు. పట్టణంలోని పేరుకుపోయిన చెత్త నిల్వలను బుధవారం డంపింగ్ యార్డుకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమ్మె కారణంగా పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా రెగ్యులర్ సిబ్బందిచే పనులు చేయిస్తున్నామన్నారు. అలాగే పట్టణవాసులు కూడా రోడ్లపై చెత్త వేయకుండా సహకరించాలని కోరారు. శానిటరీ ఇనెస్పెక్టర్ సీహెచ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల బడ్జెట్ సమావేశం

సంతకవిటి: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. సమావేశంలో 2023–24 ఏడాదికి సంబంధించి సవరణ బడ్జెట్, 2024–25 సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌పై చర్చించనున్నట్లు తెలిపారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ కృషి ప్రశంసనీయం

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. తెర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు బుధవారం బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషిచేస్తున్నారన్నారు. మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన తదితర పథకాల కింద ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వివరించారు. అలాగే జగనన్న విద్యాకానుక కింద నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం దుస్తులు, బ్యాగులు, షూ అందజేస్తున్నట్లు చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ జె.త్రినాథరావు, ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ గర్బాపు లూర్దు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు తెంటు సత్యంనాయుడు, జి.రామారావు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ బి.రత్నకుమార్, తెర్లాం హైస్కూల్ హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


తెర్లాం: స్థానిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


బొబ్బిలి: ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

బొబ్బిలి: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకునేలా రాష్ట్ర ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు అందిస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పిలుపునిచ్చారు. మండలంలోని పెంట గ్రామంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొమ్మి విశాలాక్షి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


రేగిడి: కోడిశలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు పెంటన్నాయుడు

రేగిడి: మండలంలో కోడిశ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు రేగిడి పీఏసీఎస్ అధ్యక్షుడు నెల్లి పెంటన్నాయుడు చేతులమీదుగా బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.ఆనందరావు, ఉపాధ్యాయులు బి.జగదీష్, పి.వెంకటరావు, మాజీ ఎంపీటీసీ నెల్లి సుగుణాకరరావు, నెల్లి ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలతో వ్యవసాయం కొత్త పుంతలు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆర్‌బీకేలతో రాష్ట్రంలో వ్యవసాయరంగం వృద్ధి చెందిందని, ఇదే విషయాన్ని అనేక రిపోర్టులు వెల్లడిస్తున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కమ్మవలసలో రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్‌బీకేలను ఏర్పాటు చేసిందన్నారు. రైతులకు ప్రయోజనం కలిగే అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, సర్పంచ్ పిల్లా వసుంధర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు, బొద్దల సత్యనారాయణ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవం

మండలంలోని కారాడలో రూ.20.80 లక్షల నిధులతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతీ గ్రామంలో ప్రజలకు వైద్య సేవలందించేందుకు వెల్‌నెస్ కేంద్రాలను నిర్మించినట్లు చెప్పారు. అనంతరం గ్రామంలో భూముల రీసర్వే పూర్తికావడంతో పలువురు రైతులకు పట్టదారు పాసు పుస్తకాలు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, వైస్ ఎంపీపీ డోకల జ్యోతి, సర్పంచ్ చొక్కాపు సరస్వతి, జేసీఎస్ ఇన్‌చార్జి దామోదరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సంజీవనాయుడు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

కుష్టువ్యాధి నిర్మూలనకు కృషిచేద్దాం


రేగిడిలో కుష్టువ్యాధి నిర్మూలన ర్యాలీ

రేగిడి: కుష్టువ్యాధి నిర్మూలనకు అందరి సహకారం అవసరమని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన ర్యాలీ నిర్వహించారు. కుష్టువ్యాధి లక్షణాలు, చికిత్సా విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అవగాహనతో ఉంటే వ్యాధిబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చన్నారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు చేపడుతున్న ఇంటింటి సర్వేకి ప్రజలు సహకరించాలని కోరారు. స్పర్శలేని మచ్చలు, నొప్పిలేని బొడిపెలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి కుష్టువ్యాధి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కేవీ అప్పారావు, ఏఎన్‌ఎం రాంబాయి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎంఈజీపీ రుణాలను సద్వినియోగం చేసుకోండి

రాజాం: డ్వాక్రా సంఘాల్లోని మహిళలకు ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏరియా కోఆర్డినేటర్ ఎ.చిరంజీవి అన్నారు. మండలంలో కంచరాం, పొగిరి, గురవాం గ్రామాల్లో పీఎంఈజీపీ రుణాలతో ఏర్పాటుచేసిన జీవనోపాధి యూనిట్లను బుధవారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి యూనిట్ల పనితీరుపై ఆరాతీశారు. తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లిస్తే 35 శాతం రాయితీ వస్తుందన్నారు. డ్వాక్రా సంఘాల సభ్యులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందాలని, ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ‘ఆడుదాం ఆంధ్రా’ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట, పాత బొబ్బిలి ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడల పోటీలను బుధవారం ఆమె పరిశీలించారు. యేఏ క్రీడాంశాల్లో ఎంత మంది క్రీడాకారులు పాల్గొన్నారు, మండల స్థాయి పోటీలకు ఎంతమందిని ఎంపిక చేశారు, తదితర వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో వివరాలను ఎప్పటికప్పుడు నమోదుచేయాలని అధికారులను ఆదేశించారు. క్రీడాకారులు, ప్రేక్షకుల కోసం టెంట్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలని, మైదానంలో ఫ్లెక్సీలు, మస్కట్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే క్రీడాకారులకు టోపీలు, టీషర్టులను అందివ్వాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఎంపీడీఓ పి.రవికుమార్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, ఆర్‌ఐ పి.సురేష్‌బాబు, మున్సిపల్, సచివాలయాల సిబ్బంది ఉన్నారు.


కమిషనర్ శ్రీనివాసరావుకు సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

హోరాహోరీగా ‘ఆడుదాం ఆంధ్రా’


తెర్లాం: పెరుమాళిలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ తదతర క్రీడల్లో యువత ఉత్సాహంగా పాల్గొంటున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు క్రీడా పోటీలను పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. మట్టిలో మాణిక్యాలను వెలికితీసి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. యువత ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటాలని పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్


వంగర: మహిళల కబడ్డీ పోటీలను పర్యవేక్షిస్తున్న ఎంఎంఎస్ అధ్యక్షురాలు కాంబోతుల భగవతి


రాజాం: బొద్దాంలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వైస్ ఎంపీపీ వర్షిణి, సర్పంచ్ నక్క తవిటమ్మ, తదితరులు


మెంటాడ: చల్లపేటలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ తనూజ


సంతకవిటి: మండల కేంద్రంలోని హైస్కూల్ మైదానంలో వాలీబాల్ కోర్టును సిద్ధం చేస్తున్న పీడీ సన్నిబాబు, పీఈటీలు


రేగిడి: సంకిలిలో క్రీడా పోటీల నిర్వహణలో అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి

- మండల సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశాల్లో ప్రస్తావించి వాటిని పరిష్కరించుకునేలా ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ.. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేలా చూడాలని సూచించారు. అలాగే ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గత సమావేశాల్లో సభ్యులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారంపై ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి ఆరాతీశారు. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల ప్రగతిని, గత సమావేశంలో సభ్యులు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను సంబంధిత శాఖల అధికారులు వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ గర్బాపు లూర్దు, వైస్ ఎంపీపీలు చేపేన సత్యనారాయణ, రమాదేవి, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

తెర్లాం: ఏపీటీఎఫ్(1938) మండల శాఖ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు తిరువతిరావు, జిల్లా కార్యదర్శి గంట సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి నర్సుపల్లి బాబ్జీరావు, జెడ్పీటీసీ ప్రతినిధి గర్బాపు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు తెంటు సత్యంనాయుడు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, తెర్లాం సర్పంచ్ బోనెల రూప, ఎంపీటీసీ ఆనందరావు, ఎంఈఓలు త్రినాథరావు, పాపారావు, ఏపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

సీఎం జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం సాకారం

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: రాష్ట్రంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామస్వరాజ్యాన్ని తీసుకువచ్చిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన పక్కిలో బుధవారం ‘గడపగడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే శంబంగి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా జరిగిన లబ్ధిని వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పేదలకు సంక్షేమ పథకాలు అందేవి కాదని, కేవలం పసుపు జెండాలు మోసేవారికి మాత్రమే పథకాలు అందించేవారని, పింఛను కావాలంటే గ్రామంలో ఎవరో ఒకరు చనిపోతేనే మిగతావారికి వర్తింప చేసేవారని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కుల, మతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. పింఛన్ లబ్ధిదారులకు ప్రతీ నెల ఒకటో తేదీ ఉదయమే వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛన్లు అందిస్తున్నామని వివరించారు. రానున్న ఎన్నికల్లో కూడా మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పెరుగుతున్న ప్రజాదరణను చూసి ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రజలంతా మరోసారి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు, జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, జేసీఎస్ ఇన్‌ఛార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, సర్పంచ్ గంట పైడిరాజు, ఎంపీడీఓ పి.రవికుమార్, హౌసింగ్ ఏఈ అల్లు సూర్యనారాయణ, సచివాలయ, రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

పూర్తిస్థాయిలో ఉపాధి పనులు కల్పించాలి


తెర్లాం: శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి


రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు


రేగిడి: మేట్లకు సూచనలిస్తున్న ఏపీఓ హరనాథరావు

తెర్లాం: జాబ్‌కార్డు ఉన్న వేతనదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని, పూర్తిస్థాయిలో వేతనం పొందేలా పనులు చేయించాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి సూచించారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఏపీఓ సుశీల ఆధ్వర్యంలో మేట్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ఉపాధి పనుల కల్పనలో మేట్లదే కీలకపాత్ర అని, ఇక్కడ ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేతనదారులకు ఏవిధంగా పనులు కల్పించాలని, పనులు ఎలా చేయించాలి, మస్టర్ల నమోదు, కొలతలు తీసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలను ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ వివరించారు. కార్యక్రమంలో ఉపాధి సీసీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రామభద్రపురం: ఉపాధి వేతనదారులకు పనికి తగ్గ వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఏపీఓ కె.శ్రీనాథరావు ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధి మేట్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి పనులలో మేట్లు వ్యవహరించాల్సిన విధివిధానాలపై ఈసీ, టీఏలు అవగాహన కల్పించారు. పనులకు హాజరయ్యే వేతనదారులకు రెండు పూటలా ఫోటోలు తీసి ఎన్ఐసీ సర్వర్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు మాట్లాడుతూ..ఉపాధిహామీ పథకం పనులు చేయిస్తున్న మేట్లు బాధ్యతగా పనిచేయాలన్నారు. అర్హత ఉండి, అడిగిన ప్రతీ ఒక్కరికీ జాబ్ కార్డు ఇచ్చి పని కల్పించాలన్నారు.

రేగిడి: గ్రామాల్లో ఉపాధి పనులు ప్రణాళికాబద్ధంగా చేయించాలని ఏపీఓ ఎస్.హరనాథరావు అన్నారు. కందిశ, కొండవలస, సరసనాపల్లి, తునివాడ తదితర గ్రామాల్లోని బుధవారం మేట్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వేతనదారుల మస్టర్లు నమోదు, కొలతలు వేయడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కెల్ల మన్మథరావు, ఈసీ రామినాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధి సోషల్ ఆడిట్‌పై గ్రామసభ

రాజాం: మండలంలోని రాజయ్యపేట గ్రామంలో నాలుగురోజులుగా చేపట్టిన 16వ సోషల్ ఆడిట్‌పై బుధవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 64 పనులకు సంబంధించి రూ.82 లక్షల నిధుల ఖర్చుపై ఆడిట్ నిర్వహించినట్లు ఎస్ఆర్పీ ఎన్.చిన్నబ్బాయి తెలిపారు. సంక్షేమ పథకాల అమలు, ఉపాధి పనుల నిర్వహణపై సేకరించిన వివరాలను డీఆర్పీ మల్లికార్జునరావు గ్రామ సభలో వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాసూరీ శంకరరావు, ఏపీఓ సాయిరాం, టెక్నికల్ అసిస్టెంట్ ఆనందరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఉపాధి సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.